సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఆగిరిపల్లి: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు తెలిపారు. నెక్కలం గొల్లగూడెంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలిపే బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెక్కలం గొల్లగూడెంలో నాలుగేళ్లలో రూ.36.99 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనకుమారి, సర్పంచ్ లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, నాయకులు ఇస్సాకు, సచివాలయాల కన్వీనర్ భాస్కర్‌ప్రసాద్, సీతారాంపురం సర్పంచ్ అత్తి మురళి, అడవినెక్కలం సర్పంచ్ వేము రాజు పాల్గొన్నారు.


నెక్కలం గొల్లగూడెంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు


ఎర్రమాడులో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగనర్సిరెడ్డి


ముసునూరులో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఎర్రమాడు(తిరువూరురూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రమాడులో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. ప్రతి నెలా వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, దివ్యాంగులకు పెన్షన్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేస్తున్న ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాలను వర్తింపజేస్తోందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా సత్వరం ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని, ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసురత్నం, మోహనరావు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: పల్లె సీమల సమగ్ర ప్రగతి జగనన్న ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని పేర్కొన్నారు. ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా శనివారం ముసునూరు-1 గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి ప్రత్యక్ష నగదు, పరోక్ష నగదు ప్రయోజన రూపంలో అందిన పథకాలను, లబ్ధిని నాయకులు వివరించారు. అనంతరం పథకాల వివరాలను తెలిపే డిస్‌ప్లే బోర్డును వైస్ ఎంపీపీ రాజానాయన నాయకులతో కలసి ప్రారంభించారు. అనతంతరం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పల్లెర్లమూడి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్‌సీఎస్‌ఎం (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం), విజ్ఞాన భారతి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణా పరీక్ష అయిన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) 2023–2024 నందు మండలంలోని పల్లెర్లమూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తారు. 26 జిల్లాల నుంచి ఒక్కొక్క తరగతికి 20 మంది విద్యార్థులను రాత పరీక్ష ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పల్లెర్లమూడి హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు బాణావతు ఈశ్వర్ నాయక్, సికాకొల్లు సునీల్ అనే ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ఏడాది ఎంపికైనట్లు హెచ్‌ఎం చదలవాడ ఉమా వెంకట హనుమంతరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎంతోపాటు సర్పంచ్ పులపాక సౌమ్యరేఖ, ఎంపీటీసీ చిలుకూరి అనూర్ బాషా, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మాతంగి సుందరరావు, పంచాయతీ సభ్యులు సికాకొల్లు శ్రీనివాసరావు, నాదెళ్ల మదన్ మోహన్ రావు తదితరులు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ప్రజాప్రతినిధులు

టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించాలి

జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించాలని జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్డిగూడెం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ అయిన వర్క్ వెంటనే మొదలు పెట్టాలని మొదలు పెట్టని కాంట్రాక్టర్ ఉంటే నోటీసు ఇచ్చి క్యాన్సిల్ చేసి మళ్లీ టెండర్ పిలవాలన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింగకేజీ, శ్రీనిధి, రుణాలపై ఎటువంటి షరతులు లేకుండా ఇవ్వాలని సర్వసభ్య సమావేశంలో ద్వారా తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. సర్వసభ్య సమావేశానికి వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కారించి జగనన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ఎమ్మెల్యే వసంతం వెంకటకృష్ణ ప్రసాద్ సారథ్యంలో రెడ్డిగూడెం మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 పాటిబండ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లాది రాణీ, ఓబులాపురం సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, మాతంగి వెంకటేశ్వరరావు, శ్రీరామపురం సర్పంచ్ అట్లూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ పాల్, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి

జైలు జీవితం మార్పు తీసుకురావాలి

నూజివీడు: జైలు జీవితం ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావాలని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం ఆయన సందర్శించి ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, ఆహార పదార్థాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రిమాండ్ ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. యువత ఎక్కువగా మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత సరైన మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేనివారు మండల న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమిస్తుందన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులు మళ్లీ చేయకుండా సక్రమ మార్గంలో జీవనం సాగించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ ప్రసాద్, న్యాయవాది తేజ్‌చంద్ పాల్గొన్నారు.


రిమాండ్ ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

హక్కులపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి అధ్యక్షతన మానవహక్కులపై అవగాహన సదస్సు శనివారం జరిగింది.

సంక్షిప్త వార్తలు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జి.కొండూరు: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. సెర్ప్ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి డిసెంబరు 20 వరకు చేపట్టనున్న జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంపై స్థానిక మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సన్నాహక ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయన్నారు. మహిళలు ఈ చట్టాలను సద్వినియోగపరుచుకుంటూ అన్ని రంగాల్లో సమగ్ర పురోగతిని సాధించాలని ఆకాంక్షించారు. ఈఓపీఆర్డీ భారతి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి, ఏపీఎం గురవయ్య పాల్గొన్నారు.

అర్హులకు ఓటుహక్కు కల్పించాలి

తిరువూరు: 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ ఓటుహక్కు కల్పించడానికి బీఎల్ఓలు కృషిచేయాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9 వరకు క్లెయిములు స్వీకరించవచ్చన్నారు. ఓటర్ల జాబితాలో చేరికలు, మార్పుచేర్పులు, తొలగింపులకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

గంపలగూడెం: 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై శనివారం నుంచి ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో సోషల్ ఆడిట్ చేపట్టారని ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12.30కోట్ల విలువైన పనులను సర్వశిక్ష అభియాన్, పంచాయతీ రాజ్, ఉపాధిహామీ పథకం ద్వారా 24 పంచాయతీలలో పనులను నిర్వహించామన్నారు. ఆయా పనులను డిసెంబర్ 6వ తేదీ వరకు ఆడిట్ సిబ్బంది ఎస్ఆర్పీ పర్యవేక్షణలో గ్రామాలలో తనిఖీ చేస్తారన్నారు. ఆడిట్ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారుల పర్యవేక్షణలో మండలం స్థాయిలో డిసెంబర్ 8న ప్రజా వేదిక నిర్వహించి ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో గుర్తించిన అవకతవకలపై చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

నూజివీడు: ఈ నెల 27, 28 తేదీల్లో జాతీయస్థాయి రైతు సంఘాల సమన్వయ కమిటీ, ట్రేడ్ యూనియన్ల జాతీయ వేదిక పిలుపుమేరకు గవర్నర్ కార్యాలయాల వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు విజ్ఞప్తి చేశారు. నూజివీడు అమర్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సకాలంలో గుర్తిస్తే వైకల్యాన్ని అధిగమించొచ్చు

తిరువూరు: సకాలంలో అంగవైకల్యాన్ని గుర్తిస్తే వైద్యపరీక్షలు చేసి వైకల్యం అధిగమించవచ్చని తిరుపతి బర్డ్ ఆస్పత్రి రిటైర్డు డైరెక్టర్ డాక్టర్ జగదీష్ తెలిపారు. స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రిలో శనివారం ఆర్థోపెడిక్ రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మోకీలు, మోకాలు మార్పిడి, తుంటికి శస్త్ర చికిత్స ఆవశ్యకతను వివరించారు. చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే నరాల బలహీనత, ఎముకల సమస్యలకు వైద్య చికిత్స చేశారు. రోగులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆస్పత్రి చైర్మన్ కోనేరు వెంకటకృష్ణన్, వైద్యులు కోనేరు కావ్య, కృష్ణ చైతన్య, మధుకీర్తి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

తిరువూరు: స్థానిక సిద్ధార్థ స్కూలులో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ శనివారం గ్రీన్ డే నిర్వహించారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని, చెట్లు నరకవద్దని కరస్పాండెంటు చక్రపాణి విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఆకుపచ్చ దుస్తుల్లో అలరించారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

గంపలగూడెం: మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలవాల సుందరయ్య పేర్కొన్నారు. తోటమూలలో శనివారం నిర్వహించిన యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ కౌన్సిలింగ్ ద్వారా మండలానికి 19 మంది ఉపాధ్యాయులు మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ప్రాతిపదికన కేటాయింపు జరిగిందని తెలిపారు. వీరిలో 11 మంది జాయిన్ కాలేదన్నారు. దీంతో మండలంలో రెండు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని, మరో 19 పాఠశాలలో ఒక ఉపాధ్యాయునితో నడుస్తున్నాయన్నారు. అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తగినచర్యలు తీసుకోవడం ద్వారా ఖాళీలను భర్తీ చేసి సక్రమంగా విద్యా బోధన జరిగేలా చూడాలని ఆయన కోరారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు డి.అపర్ణ, ప్రధాన కార్యదర్శి పి. ఏడుకొండలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైలవరం విద్యార్థుల ఎంపిక



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ షూటింగ్ బాల్ జిల్లా స్థాయి అండర్-17, అండర్-19 బాల, బాలికల ఉమ్మడి కృష్ణా జిల్లా జట్ల ఎంపికలకు స్థానిక డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ ఎంపికలో సుమారు 150 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు త్వరలో చిత్తూరు, అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కే కనకదుర్గ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామోపాధ్యాయులు కే వెంకయ్య, ఎస్ సాంబశివరావు, చంద్రశేఖర్, వెంకట్రావు, మాధవరావు, లక్ష్మణరావు, దీప పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన రాష్ట్ర స్థాయి అండర్-17కు ఎంపికైన బాల బాలికల జట్లను ఇన్‌చార్జి హెచ్‌ఎం కనకదుర్గ అభినందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ఆగిరిపల్లి: నెక్కలం గొల్లగూడెం మసీదు సమీపంలో మలుపు వద్ద ఆగిరిపల్లి వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఉన్న వ్యక్తి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. విద్యుత్ స్తంభం విరిగినా మెయిన్ రోడ్డుపై పడకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

వైభవంగా శోభనాచలుడి శాంతి కల్యాణం

ఆగిరిపల్లి: కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లిలోని శోభనగిరిపై వేంచేసి ఉన్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం ఆలయ అర్చకులు శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామికి నవ కలశ పంచామృత స్నపన, విశేషాలంకరణ, శాంతి కల్యాణం, సుదర్శన మంత్ర హోమం, పూర్ణాహుతి, నిత్య హోమం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదం వినియోగం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంత శేషుబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. స్వామి శాంతి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్(కాంట్రాక్ట్)గా పనిచేస్తున్న దిల్‌కుష్(34) శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందారు. రాత్రి 10 గంటల సమయంలో తను నివాసం ఉండే క్వార్టర్స్‌లో ఛాతిలో నెప్పి ఉన్నట్లుగా తన సహచర ఉద్యోగికి ఫోన్‌లో తెలపగా, వారు మందుబిళ్ల తెచ్చేలోగానే కుర్చీలో కూలబడి ఉంది. దీంతో వెంటనే ఆమెను క్యాంపస్‌లో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం రిఫర్ చేశారు. దీంతో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఏలూరులో ఆమె స్వగృహానికి తరలించారు. ట్రిపుల్ ఐటీ బోధన సిబ్బంది ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

తిరువూరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను గురించి కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ విద్యార్థులకు వివరించారు. ప్రతి పౌరుడు సమాజంలో బాధ్యతగా మెలగాలని, ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. రాజ్యాంగ పవిత్రత కాపాడతామని విద్యార్థులు రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేశారు.

ఏ కొండూరులో..

ఏ.కొండూరు: మండలంలోని రామచంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంఘిక శాస్త్ర ప్రాజెక్టుల ప్రదర్శన పాఠ్యాంశాలకు సంబంధించిన మోడల్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు బి.విశ్వభారతి, సర్పంచ్ ఎం.సీతయ్య, హెచ్‌ఎం సాయిబాబు, ఎంఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా తులసి, దామోదర కల్యాణం

గంపలగూడెం: కార్తికమాసం పర్వదినోత్సవం సందర్భంగా గంపలగూడెంలో దామోదర తులసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు తూకుంట్ల లక్ష్మణ శాస్త్రీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు కుందా ప్రసాద్, ఉషారాణి దంపతులచే కల్యాణోత్సవం జరిపారు. గణపతి పూజతో తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజ ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా తులసి,దామోదర కళ్యాణాన్ని కనులవిందుగా జరిపారు. అనంతరం కోటి పోగులు వత్తి, లక్ష పోగుల వత్తి, వెయ్యి కమల వత్తులు, అర్ధనారీశ్వర వత్తి, శివలింగాకార వత్తి, బృందావనం వత్తి, కోటి మారేడు దళం వత్తి, కోటి సోమవారం వత్తులను వెలిగించారు.

మార్షల్ ఆర్ట్స్ జిల్లా స్థాయి ఎంపికలు

విస్సన్నపేట: మార్షల్ ఆర్ట్స్ జిల్లా స్థాయి ఎంపికలు స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాలలో శనివారం జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ సీజర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాల ప్రభుత్వ, ప్రైవేటు పాటశాలల విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆర్గనైజర్ సత్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

జెండర్లను వివక్షతో చూడొద్దు

చాట్రాయి: జెండర్లను వివక్షతో చూడవద్దని వెలుగు ఏపీఎం టి.శేఖర్ పిలుపునిచ్చారు. చాట్రాయి గ్రామంలో జెండర్ల వివక్షతకు వ్యతిరేకంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. జెండర్లను సమాజంలో అందరూ ఆదరించాలని, సమానంగా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి సెంటర్లో మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మాచారి, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి టి.సరోజినీ పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: లింగ వివక్ష ఆధారంగా జరుగుతున్న హింసను నిరోధించాలని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దువ్వూరి పద్మావతి పేర్కొన్నారు. ముసునూరులో గ్రామీణాభివృద్ధి శాఖ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కుంటం బాబు ఆధ్వర్యంలో జెండర్ వివక్షత నిరోధక మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.

వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకం

పోరాటనగర్(మైలవరం): వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం అని స్టూడెంట్స్ ఆక్టివ్ సెంటర్ డైరెక్టర్ సాయి విజయ్ తెలిపారు. మైలవరం మండలం పోరాటనగర్ గ్రామంలో స్మార్ట్ విలేజ్ ప్రోగ్రామ్ పౌష్టిక ఆహార విలువలు, టీకాలు, వ్యాక్సిన్ గురించి గర్భిణులు, చిన్నారులకు శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. సాయి విజయ్ మాట్లాడుతూ గర్భిణులు , చిన్న పిల్లలుకు పౌష్టికాహారం, జాగ్రతలు తెలియజేశారు. వ్యవసాయంలో మహిళలు ప్రముఖ పాత్ర వహించడం వలన దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ స్టూడెంట్ మెంటార్ టి.శివకృష్ణ, అగ్రికల్చర్ మెంటార్ బి.రాంబాబు పాల్గొన్నారు.

మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

విస్సన్నపేట: అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. రెడ్డిగూడెం మండలం నుంచి స్థానిక ఎ కొండూరు రోడ్డులో ఖాళీస్థలం మెరవనులకు ట్రాక్టర్లతో మట్టి రవాణా చేస్తుండగా స్థానిక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు ఆ ట్రాక్టర్లను నిలిపి, అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్లు సీజ్ చేశారు.